మూసాపేట బోనాలు.. ఆలయాలు ముస్తాబు.!

నేడు గ్రామ దేవతలకు బోనాలు సమర్పించనున్న భక్తులు

మూసాపేట: మూసాపేట గ్రామంలో ఆషాఢమాస బోనాల ఉత్సవాలు గురువారం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఆయా ఆలయ నిర్వాహకులు అమ్మవార్ల ఆలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆలయాల్లో విద్యుత్ దీపాలంకరణ, రంగులు, పూలతో సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. మొక్కులుగా బోనాలు సమర్పించే భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నామని ఆలయ నిర్వాహకులు తెలిపారు. సుమారు 100 సంవత్సరాలకు క్రితం గ్రామ దేవతలుగా మూసాపేట గ్రామంలో అమ్మవార్లు వెలిశారు. గ్రామంలో రోగాలు ప్రబలుతున్నప్పుడు గ్రామ పెద్దలు కలిసి గ్రామ దేవతలకు పూజలు చేస్తున్నారు.

◆ భవానీనగర్‌లోని పోచమ్మ తల్లి, మూసాపేట ప్రభుత్వ పాఠశాల వద్ద ఉన్న మహంకాళి అమ్మవారు, గూడ్స్ షెడ్ రోడ్డులోని ముత్యాలమ్మ తల్లి, మూసాపేటలోని ప్రధాన రహదారిలోని నల్లపోచమ్మ తల్లి, గ్రామ దేవతలుగా ఆనాటి నుంచి నేటి వరకు పూజలు అందుకుంటున్నారు. జనతానగర్‌లోని పోచమ్మ తల్లి ఆలయంలో కూడా అమ్మవారిని కొన్ని సంవత్సరాలుగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. నగరంలోని బోనాల పండుగకు ముందే ఇక్కడి గ్రామ దేవతలకు బోనాల మొక్కులను సమర్పించుకుంటారు. వారం ముందే గ్రామ బొడ్రాయికి పూజలు చేసిన అనంతరం గురువారం రోజు గ్రామ దేవతలకు బోనాలు, ఆదివారం చిత్తారమ్మ తల్లి జాతరను నిర్వహించటం ఇక్కడ అనాదిగా వస్తున్న సంప్రదాయం.


భవానీనగర్‌లోని పోచమ్మ తల్లి ఆలయం, అమ్మవారు

మొదటి పూజ పోచమ్మతల్లికి...

మూసాపేట భవానీనగర్‌లోని పోచమ్మ తల్లి కొన్ని సంవత్సరాల క్రితం ప్రతిష్ఠించి పూజలు నిర్వహిస్తున్నారు. విష జ్వరాలు ప్రబలటంతో అమ్మవారిని ప్రతిష్ఠించారు. ఇక్కడి అమ్మవారిని శీతలి మాతగా కొలుస్తారు. తట్టు, పొంగు వంటి విష జ్వరాలు వచ్చినప్పుడు కాలనీ వాసులే కాక చుట్టు పక్కల ప్రజలు కూడా అమ్మవారికి పూజలు నిర్వహిస్తుంటారు. గురువారం నిర్వహించే బోనాల వేడుకల్లో మొదటి పూజను పోచమ్మ తల్లికి నిర్వహించిన తరువాతనే మిగతా ఆలయాల్లో నిర్వహించటం ఆనవాయితీగా వస్తున్నది. ఎవరి ఇంట కళ్యాణం జరిగినా పెండ్లి చీరను అమ్మవారి ముందు ఉంచి పూజలు చేసి తీసుకెళ్లటం ఇక్కడి ప్రజల నమ్మకం. ఎవరి ఇంట్లో ఆరోగ్యం బాగుండకపోయినా అమ్మవారికి సాక పోసి వేడుకుంటే తగ్గిపోతుందని భక్తుల విశ్వాసం.

నాగలితో దున్నుతుండగా వెలిసిన మహంకాళి...

మూసాపేట ప్రభుత్వ పాఠశాల వద్ద వందల సంవత్సరాల క్రితం మహంకాళి, సరస్వతి అమ్మవార్ల ఆలయం ఉంది. సుమారు శతాబ్దం క్రితం ఆలయం ఉన్న ప్రాంతమంతా పంట పొలాలతో ఉండేది. రైతులు నాగలితో పొలం దున్నుతుండగా మహంకాళి అమ్మవారి విగ్రహం నాగలికి తగిలింది. భూమిలో నుంచి అమ్మవారి విగ్రహాన్ని వెలికి తీసి అదే ప్రాంతంలో ప్రతిష్ఠించి పూజలు నిర్వహిస్తూ వస్తున్నారు. కాలక్రమేణా అమ్మవారికి ఆలయం కట్టించి సరస్వతి అమ్మవారిని కూడా ప్రతిష్ఠించి పూజలు చేస్తున్నారు. ఆలయ వార్షికోత్సవం, బోనాల పండుగలను ఎంతో ఘనంగా నిర్వహిస్తుంటారు.


భవానీనగర్‌లో బోనాలను పురస్కరించుకొని విద్యుత్ దీపాలంకరణలో ఆలయం కమాన్

పుట్టలో వెలిసిన ముత్యాలమ్మ తల్లి....

మూసాపేట గూడ్స్‌షెడ్ రోడ్డులో పూర్వం పూజలు అందుకున్న ముత్యాలమ్మ తల్లి కాలక్రమేణా పుట్టలోకి పూర్తిగా వెళ్లిపోయింది. కొన్ని సంవత్సరాల తరువాత గ్రామ పెద్దకు కలలో అమ్మవారు కనిపించి రావి చెట్టు క్రింద పుట్టలో ఉన్నానని తనకు ఆలయం నిర్మించాలని ఆదేశించింది. అప్పటి గ్రామ పెద్దలందరు కలిసి ఆలయాన్ని నిర్మించారు. తిరిగి 2008లో ఆలయాన్ని పునర్నిర్మించి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. బోనాల ఉత్సవాలు, వార్షికోత్సవం అత్యంత వైభోగంగా నిర్వహిస్తుంటారు.


మూసాపేట గూడ్స్ షెడ్ రోడ్డులో ముత్యాలమ్మ ఆలయం

కోరికలు తీర్చే నల్ల పోచమ్మ...

మూసాపేట జాతీయ రహదారిపై నల్లపోచమ్మ తల్లి ఆలయం ఎన్నో సంవత్సరాల నుంచి పూజలు అందుకుంటున్నది. కొన్ని సంవత్సరాల తరువాత ఆలయం శిథిలావస్థకు చేరుకోవటంతో 1996లో అదే స్థలంలో పునఃప్రతిష్ఠించారు. కోరిన కోరికలు తీర్చే చల్లని తల్లిగా అమ్మవారు కొలువు దీరి ఉంది. మూసాపేట గ్రామ ప్రజలు ఏ ఊరుకెళ్లినా అమ్మవారిని దర్శించుకొని వెళుతుంటారు.

కూకట్‌పల్లి పోచమ్మ ఆలయంలో..

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి గ్రామంలోని పోచమ్మ తల్లి అమ్మవారి ఆలయంలో గురువారం బోనాల పండుగను ఘనంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. కూకట్‌పల్లిలో గ్రామంలోని భక్తులందరూ సామూహికంగా బోనాలను సమర్పించనున్నారని తెలిపారు. ఆలయంలో బోనాలు సమర్పించేందుకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని మౌలిక సదుపాయాలు, సౌకర్యాలు కల్పించామని ఆలయ నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ ఆలయంలో భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి బోనాలను సమర్పిస్తారు.


మూసాపేట ప్రభుత్వ పాఠశాల వద్ద ఉన్న మహంకాళి ఆలయం



విద్యుద్దీపాల వెలుగులో మూసాపేట జాతీయ రహదారిపై నల్లపోచమ్మ ఆలయం, ముస్తాబవుతున్న కూకట్‌పల్లిలోని పోచమ్మ ఆలయం

సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేయాలి


అధికారులతో సమీక్షా సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

ఆల్విన్‌కాలనీ: శేరిలింగంపల్లి నియోజకవర్గం కూకట్‌పల్లి డివిజన్ పార్టు, హైదర్‌నగర్, ఆల్విన్‌కాలనీ డివిజన్‌ల పరిధిలో చేపట్టవలసిన పనులు, పలు సమస్యలపై డీసీ కృష్ణయ్య, డీసీ మోహన్‌రెడ్డి, జీహెచ్‌ఎంసీ ఇంజినీరింగ్ విభాగం, జలమండలి, టౌన్‌ప్లానింగ్, వీధిలైట్లు, శానిటేషన్ అన్ని విభాగాల అధికారులతో శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీహెచ్‌ఎంసీ, అన్ని విభాగాల అధికారులు కలిసి సమన్వయంతో పనిచేయాలన్నారు. ప్రజా సమస్యలే పరిష్కార ధ్యేయంగా పనిచేయాలన్నారు. ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండాలని, ప్రజా సమస్యలపై అధికారులు నిర్లిప్తతను వీడాలన్నారు. ప్రజల నుంచి వచ్చిన సమస్యలపై స్పందించాలన్నారు. ప్రజావసరాల దృష్ట్యా కాలనీలో నెలకొన్న రోడ్ల సమస్యలను ప్రథమ ప్రాధాన్యతగా పరిగణలోకి తీసుకొని త్వరగా పరిష్కారం అయ్యేలా కృషి చేయాలని, పనులను వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుంఆ అన్ని రకాల చర్యలు తీసుకోవాలన్నారు. వర్షాలకు మాన్‌సూన్‌సిబ్బంది అప్రమత్తంగా ఉండేలా చూడాలని, అవసరమున్న చోట యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాలని ఎమ్మెల్యే గాంధీ అధికారులకు తెలిపారు. ప్రజలకు అవసరమైన పారిశుధ్యం, వీధి దీపాల నిర్వహణలో క్షేత్ర స్థాయిలో అసంపూర్తిగా పనిచేస్తున్నారని, ప్రజలకు ప్రజా సమస్యలు పరిష్కరించకుండా, ఇబ్బంది కలిగించే విషయంలో ఉపేక్షించే ప్రసక్తే లేదని అధికారులకు తెలిపారు. కాలనీలో అసంపూర్తిగా మిగిలిపోయిన రోడ్లను త్వరగా పూర్తి చేయాలన్నారు.

జెడ్సీని కలిసిన ఎమ్మెల్యే



ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్‌ను జోనల్ కార్యాలయంలో బుధవారం శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శేరిలింగంపల్లి నియోజకవర్గాలైన ఆల్విన్‌కాలనీ, హైదర్‌నగర్, వివేకానందనగర్, కూకట్‌పల్లి పార్టుల్లో నెలకొన్న పలు సమస్యలు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై జోనల్ కమిషనర్‌తో చర్చించారు. పెండింగ్‌లో ఉన్న పనులను త్వరగా పూర్తయ్యేలా అధికారులను ఆదేశించాలన్నారు. అసంపూర్తిగా మిగిలిపోయిన పనులు త్వరగా పూర్తయ్యేలా చూడాలన్నారు. అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని, అవసరమైతే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి అధిక మొత్తంలోనిధులు మంజూరు అయ్యేలా కృషి చేస్తానని, పనుల్లో వేగం పెంచాలని కోరారు. వర్షాకాలంను దృష్టిలో పెట్టుకొని ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా అన్ని రకాల చర్యలు తీసుకోవాలన్నారు. అదే విధంగా చెరువుల సుందరీకరణ, పార్కులు అభివృద్ధి చేపట్టాలని, రోడ్ల మరమ్మతులు చేపట్టాలన్నారు. అధికారులతో చర్చించి తక్షణమే చర్యలు తీసుకోవాలన్నారు. సమస్యలపై జెడ్సీ అపూర్వ చౌహాన్ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

వృక్షారోపణ సప్తాహ.!



వెంకటేశ్వరనగర్ బస్తీలో వృక్షారోపణ సప్తాహ కార్యక్రమంలో భాగంగా బుధవారం శ్రీసరస్వతి శిశుమందిర్‌లో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. పర్యావరణ రక్షణకు ప్రజల్లో అవగాహన కల్పించేందుకు విద్యార్థులు మొక్కలు చేతపట్టుకొని ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జగద్గిరిగుట్ట పోలీస్‌స్టేషన్ ఏఎస్‌ఐ రమణ, పాండు, వినయ్‌కుమార్, కార్యదర్శి సత్యనారాయణ, భగవంతాచారి, ప్రధానాచార్యులు సరస్వతి హాజరయ్యారు. – ఆల్విన్‌కాలనీ

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత



కూకట్‌పల్లి: మూసాపేట డివిజన్ జనతానగర్‌కు చెందిన ఎపురాల కృష్ణవేణి కొంత కాలంగా ఊపిరితిత్తుల కేన్సర్‌తో బాధపడుతోంది. వైద్యులు ఆపరేషన్ చేయాలని చెప్పటంతో ఆమె కుటుంబ సభ్యులు విషయాన్ని కూకట్‌పల్లి కాంగ్రెస్ నేత గొట్టిముక్కల వెంకటేశ్వరరావు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేయించారు. ఈ మేరకు మంజూరైన రూ.65వేల ఎల్‌ఓసీ పత్రాన్ని బుధవారం బండి రమేష్‌తో కలిసి అందజేశారు. ఈ కార్యక్రమంలో మేకల రమేష్, పాతపల్లి సాయిరామ్, కృష్ణ, ప్రశాంత్ పాల్గొన్నారు.

శ్మశానవాటికలో మౌలిక సదుపాయాలు కల్పించండి


శ్మశానవాటికను పరిశీలిస్తున్న సీపీఎం నేతలు

ఆల్విన్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ హిందూ శ్మశానవాటికను అభివృద్ధి చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి ఎం. శంకర్, బి. శ్రీను పాల్గొని మాట్లాడుతూ.. ఆలి తలాబ్ వద్ద ఉన్న హిందూ శ్మశానవాటికలో మంచినీటి ట్యాంకును ఏర్పాటు చేయాలన్నారు. విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి వీధి లైట్లు వేయాలన్నారు. శ్మశానవాటిక చుట్టూ ప్రహరీ నిర్మించాలన్నారు. బస్తీ రోడ్డు నుంచి శ్మశానవాటిక వరకు సిమెంట్ రోడ్డు వేయాలన్నారు. శ్మశానవాటికలో నిర్మించిన రూమ్‌ను పగలగొట్టి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. పోలీసులు గస్తీ పెంచాలన్నారు. వాచ్‌మెన్‌ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అదే విధంగా అలీ తలాబ్ చెరువులోని గుర్రపుడెక్కని తొలగించి, దోమల నుంచి స్థానికులను కాపాడాలని డిమాండ్ చేశారు. బస్తీ దవాఖానాలో సిస్టర్ లేకపోవంతో రక్త పరీక్షలు జరగటం లేదని, బస్తీ దవాఖానాలో సిస్టర్‌ను ఏర్పాటు చేయాలన్నారు. మహేష్‌గౌడ్, వెంకటేష్, శ్రీరాములు, రాజు, మహేష్, రాములు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాణస్వీకారం చేసిన హరిహరక్షేత్ర ఆలయ కమిటీ

మూసాపేట: భరత్‌నగర్ కాలనీలోని హరిహర క్షేత్ర ఆలయ కమిటీ చైర్మన్‌గా పట్లోళ్ల నాగిరెడ్డి బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ మధుబాబు నాగిరెడ్డితో పాటు ఆలయ కమిటీ సభ్యుల సూర్యనారాయణ మూర్తి, సంతోష్‌కుమార్, లక్ష్మీనారాయణ, మనెమ్మ, శ్రీనివాసరాజు, వెంకటేష్ యాదవ్‌లతో పాటు ఎక్స్ అఫీషియో మెంబర్‌గా కృష్ణ సూరిలచే ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ నాగిరెడ్డి మాట్లాడుతూ.. పాలకవర్గ సభ్యులతో కలిసి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తూ, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూస్తామని తెలిపారు. పోచమ్మ ఆలయంలో బోనాల పండుగను ఘనంగా నిర్వహిస్తామన్నారు. ఆలయ నిర్వాహణాధికారి విజయభారతి, మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు హరివర్ధన్‌రెడ్డి, కూకట్‌పల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్, సత్యం శ్రీరంగం పాల్గొన్నారు.

ఘనంగా కేటీఆర్ జన్మదిన వేడుకలు

- కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ ఆధ్వర్యంలో సంబురాలు
- భాగ్యశ్రీ గార్డెన్‌లో జరిగిన వేడుకల్లో భారీగా హాజరైన కార్యకర్తలు
- మొక్కలు నాటి మహిళలకు చీరలను పంపిణీ చేసిన కార్పొరేటర్


కేటీఆర్ జన్మదిన వేడుకల్లో మాట్లాడుతున్న కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్

ఓల్డ్‌బోయిన్‌పల్లి: రాష్ట్ర మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఉన్నత స్థాయికి ఎదగాలని, ఆయురారోగ్యాలతో ఉండాలని ఓల్డ్‌బోయిన్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ ఆకాంక్షించారు. ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్‌లోని భాగ్యశ్రీ గార్డెన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులతో కలసి కేటీఆర్ జన్మదిని వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులతో కలిసి కార్పొరేటర్ కేక్ కట్ చేసి అందరికి పంచి పెట్టారు. అనంతరం కేటీఆర్ పేరు మీద మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వేయి మంది మహిళలకు చీరలను పంపిణీ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ మాట్లాడుతూ... కేటీఆర్ జన్మదిన వేడుకలకు వేలాది మంది మహిళలు, అభిమానులు, నాయకులు తరలిరావడం ఆనందంగా ఉందన్నారు. కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సహాయ సహకారాలతో డివిజన్‌ను ఎంతో అభివృద్ధి చేశామన్నారు. కేటీఆర్ సహకారంతో బీటీ, సీసీ రోడ్ల నిర్మాణం, శ్మశానవాటికలు, పార్కుల అభివృద్ధి, నాలాలు, డ్రైనేజీలు, మంచినీటి పైపులైన్ల ఆధునీకరించుకున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు ఇర్ఫాన్, కార్యదర్శి మేకల హరినాథ్, నాయకులు నరేందర్‌గౌడ్, సయ్యద్ ఎజాజ్, మక్కాల నర్సింగ్‌రావు, బల్‌రాజు, గడ్డం నర్సింగ్‌రావు, కర్రె జంగయ్య, కర్రె లావణ్య, పిట్ల రాజు, మన్నె ఉదయ్‌యాదవ్, వాసు యాదవ్, రాజుగౌడ్, మట్టి శ్రీను, దాసు, ఖదీర్, లలిత, సరోజదేవి, శ్యామల, తదితరులు పాల్గొన్నారు.


చీరలను పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్


కార్పొరేటర్‌తో కలిసి మొక్కలు నాటుతున్న నాయకులు

కాంగ్రెస్‌లో భారీగా చేరికలు


కాంగ్రెస్‌లో చేరిన మహిళలకు పార్టీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ


ఎమ్మెల్యే గాంధీని మర్యాదపూర్వకంగా కలిసిన సాయినగర్ వెస్ట్‌జోన్ వాసులు

ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి డివిజన్‌కు చెందిన బీఆర్ఎస్ మహిళా నాయకురాళ్లు బుధవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరికి శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అందిస్తున్న ప్రజా పాలనను చూసి ఆకర్షితులై అనేకమంది కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారన్నారు. పార్టీలో ప్రతి ఒక్కరికి సముచిత స్థానం ఉంటుందని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయాలన్నారు. రాబోయే రోజుల్లో శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేసుకోవచ్చన్నారు. పార్టీలో చేరిన వారిలో శ్రావణిరెడ్డి, శ్రీజ్యోతి, పుష్ప, కుమారి, ఇంద్ర, పద్మ, నాగలక్ష్మి, సావిత్రి, రామలక్ష్మి, లక్ష్మి, పద్మ, కరుణశ్రీ, శోభా, భూలక్ష్మి, తదితరులు ఉన్నారు.

శుభాకాంక్షలు...

ఇటీవల కాంగ్రెస్ పార్టీలో చేరిన శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీని సాయినగర్ వెస్ట్ జోన్ కాలనీ వాసులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గ ప్రజల సంక్షేమమే తన ప్రథమ కర్తవ్యంగా భావించి కాంగ్రెస్ పార్టీలో చేరానన్నారు. ఈ కార్యక్రమంలో వెస్ట్‌సాయినగర్ కాలనీవాసులు శివరాజు గౌడ్, రాజేష్‌చంద్ర, ప్రభాకర్, శ్రీధర్‌రావు, సంతోష్, ప్రవీణ్, మహేష్, కాలనీవాసులు పాల్గొన్నారు.

30న కార్మికుల సమస్యలపై ధర్నా

బాలానగర్: శ్రీశ్రీ నగర్‌లోని సిఐటీయుసి కార్యాలయంలో బుధవారం మున్సిపల్ కార్మికుల సమస్యలపై ఏఐటీయూసీ నాయకులు మూర్తి ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఏఐటీయూసీ నాయకులు జి. కృష్ణ హాజరై మాట్లాడుతూ... అసెంబ్లీ సమావేశాల సందర్భంగా ఈ నెల 30న ఇందిరా పార్కు వద్ద తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మున్సిపల్ కార్మికుల ధర్నా ఉందని తెలిపారు. న్యాయమైన సమస్యలు పరిష్కారం చేయాలన్నారు. కార్మికులను వెంటనే పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. సుప్రీం కోర్టు తీర్పు మేరకు 26 వేల రూపాయలు అందజేయాలని తెలిపారు. ఇందిరా పార్కు వద్ద జరిగే కార్యక్రమానికి కార్మికులు పెద్ద ఎత్తున హాజరు కావాలన్నారు.

బీసీ డిక్లరేషన్ హామీని నిలబెట్టుకోవాలి

కూకట్‌పల్లి: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కామారెడ్డి సభలో ప్రకటించిన బీసీ డిక్లరేషన్ హామీని నిలబెట్టుకోవాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా బుధవారం వారు తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ రాష్ట్ర ఆఫీస్ సెక్రటరీ దేశబత్తుల సుధారవి, అసెంబ్లీ కన్వీనర్ శ్రీకర్ రావు, నాయకులు ప్రీతం, పవన్, సతీష్, నాగరాజ్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రమాద రహిత వారోత్సవాలు

మూసాపేట: ట్రాఫిక్ రూల్స్ పాటిస్తూ ప్రయాణికులను గమ్యస్థానాలకు క్షేమంగా చేర్చే బాధ్యత డ్రైవర్లదే అని కూకట్‌పల్లి ట్రాఫిక్ సిఐ ముత్తుయాదవ్ అన్నారు. బుధవారం కూకట్‌పల్లి ఆర్టీసీ డిపోలో ప్రమాదరహిత వారోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన డ్రైవర్లకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. బస్సులను బస్‌బేలో నిలుపుకోవాలని, సెల్ ఫోన్ డ్రైవింగ్ చేయవద్దని సూచించారు. విధులకు హాజరయ్యే సమయంలో మనసు ప్రశాంతతతో హాజరై డ్రైవింగ్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కూకట్‌పలి డిపో మేనేజర్ డి.హరి, అసిస్టెంట్ మేనేజర్ శ్రీలత, ఎంఎఫ్ రాజేశ్వరి, కార్మికులు పాల్గొన్నారు.